విద్యుత్ పనులు వేగవంతం చేయండి

ప్రజాశక్తి -అరకులోయ: పాడేరు ఏజెన్సీలోని అరకులోయ మండలంలో ఎపిఇపిడిసిఎల్ సీఎండీ ఐ.పృధ్వీతేజ్ మంగళవారం పర్యటించారు. అరకు మండలంలో ఇటీవల విద్యుత్ సౌకర్యం కల్పించిన పివిటిజి, నాన్ పివిటిడి గిరిజనుల ఇళ్లను సందర్శించి, వినియోగదారులతో మాట్లాడారు. పని జరుగుతున్న గ్రామాలను సందర్శించి, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సంస్థ విశాఖ ఎస్ఇ మహేంద్రనాథ్, పాడేరు ఇఇ ఎవిఎస్ఎం.అప్పారావు పాల్గొన్నారు.

సూచనలు చేస్తున్న సిఎండి పృధ్వీతేజ్

మండుటెండల్లోనే ఉపాధి పనులు

- పని ప్రదేశంలో కానరాని సౌకర్యాలు
- కూలీల అవస్థలు.. పట్టని అధికారులు

ప్రజాశక్తి-హుకుంపేట: ఉపాధి హామీ పథకం అమలు నానాటికీ తీసికట్టుగా మారిపోతోందని కూలీలు ఆవేదన చెందుతున్నారు. ఉపాధి పనులకు వెళ్లే కూలీలకు గతంలో అనేక సౌకర్యాలు, అలవెన్సులు కల్పించగా, ఇపుడు ఒక్కటొక్కటిగా అన్నింటినీ ఎత్తేసి, ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తున్నారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో మండుటెండల్లో అవస్థలు పడుతున్నామని, అయినా అటు అధికారులుగానీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గానీ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా కుట్ర చేస్తున్నారని ప్రజలు, ప్రజాసంఘాల ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

మండలంలోని ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులను కల్పిస్తున్నా పనిప్రదేశంలో సౌకర్యాల కల్పనలో ప్రభుత్వయంత్రాంగం నిర్లక్ష్యం చేస్తోంది. దీంతో పనులు ముమ్మురంగా జరుగుతున్నా, మండుటెండల్లోనే కూలీలు అవస్థలు పడుతూ పనులు చేస్తున్నారు. ఇంతగా పనిచేసే ఒక్కో కూలీకి రోజుకు రూ. 284 మాత్రమే కూలి చెల్లిస్తున్నారు. మామూలు జాబ్‌కార్డులకు 100 పనిదినాలు కల్పిస్తుండగా, పోడుభూమి పట్టాలున్న వారికి మాత్రమే 150 పనిదినాలు అవకాశం ఉంది. అయితే అది ఎటూ సరిపోవడం లేదని గిరిజన కూలీలు అంటున్నారు. గతంలో ఎండాకాలంలో ఉపాధి పనులు చేసే వారికి కూలీ డబ్బులకు అదనంగా వేసవి అలవెన్స్‌ను కలిపి చెల్లించేవారు. దీంతో మండుటెండలో కష్టబడినా కూలీలకు ప్రతిఫలం దక్కేది. కానీ ఇపుడు వేసవి అలవెన్స్‌ను అటకెక్కించేశారని కూలీలు వాపోతున్నారు. అంతేకాక పనిప్రదేశంలో నీడకు టెంట్, తాగునీటి సౌకర్యం, దానికోసం ప్రత్యేకంగా కూలీకి ఒక మస్తరు ఇచ్చేవారు. వంద పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీలకు గునపాం, పార వంటి పనిముట్లు ప్రభుత్వపరంగా ఉచితంగానే ఇచ్చేవారు. పనికి వచ్చే కూలీల పిల్లలను చూసుకునేందుకు ఒక ఆయా, వేసవిలో మజ్జిగ ప్యాకెట్లు విధిగా ప్రథమ చికిత్స కిట్లు ఇలా అన్ని సౌకర్యాలు కల్పించగా, ఇపుడు వాటన్నింటికీ ప్రభుత్వం మంగళం పాడేసింది. మండుటెండల్లోనే పనులు చేస్తున్నా పట్టించుకునే దిక్కులేదు. అరకొర వేతనం ఇస్తుండడంతో గిట్టుబాటు కావడంలేదని, ఎటువంటి అలవెన్స్‌లు ఇవ్వడం లేదని అంటున్నారు. పెద్దలు పనికి వెళితే, వారి పిల్లల ఆలనాపాలనా చూసే వారు లేక అక్కడ చెట్టు ఉంటే దాని నీడలోనే, లేకుంటే ఎండలోనే పడిగాపులు పడాల్సి వస్తుందని అంటున్నారు. పనిప్రదేశంలో తట్టలే కూలీలకు నీడనిచ్చే రక్షణగా ఉంటున్నాయంటే, ఉపాధి పనులు పట్ల ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో స్పష్టమౌతోందని, ఈ పథకాన్ని నిర్వీర్యం చేయడానికే అన్నట్లు ప్రభుత్వం చర్యలు ఉన్నాయని కూలీలు మండిపడుతున్నారు. పనిప్రదేశంలో సౌకర్యాల కల్పనతోపాటు రోజువారీ కూలీ వేతనం పెంచాలని వేతనదారులు కోరుతున్నారు.

మండుటెండలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు

ఉపాధి పని దినాలు పెంచాలి

అరకులోయ రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు ఏడాదికి 200 రోజులు పనిదినాలు కల్పించి, రోజుకు రూ. 600 కూలి ఇవ్వాలని సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం అరకువేలి మండలం పానిరంగిని గ్రామంలో ఉపాధి పని ప్రదేశాన్ని సందర్శించి, కూలీలకు సమస్యలను అడిగి తెలుసుకున్నారు అనంతరం మాట్లాడుతూ.ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎండలు తీవ్రతను పనిప్రదేశంలో టెంట్లు మెడికల్ కిట్లు ఏర్పాటుతోపాటు కూలీలకు రోజూ మజ్జిగ పంపిణీ చేయాలని కోరారు. బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు పెంచి, కూలీలకు మునుపటిలా ఉచిత పనిముట్లుఇవ్వాలని కోరారు. సమస్యలు పరిష్కారానికి ఉపాధి కూలీలంతా సంఘంగా ఏర్పాటై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు కిండంగి రామారావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వి.ఉమామహేశ్వరరావు

తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం ప్రజాప్రతినిధులు, నాయకులు

ముందస్తుగా వరద సహాయక చర్యలు చేపట్టాలి

- తహశీల్దారుకు సిపిఎం వినతి

ప్రజాశక్తి-కూనవరం

రానున్న వరదల సమయంలో ముంపు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తుగా వరద సహాయక చర్యలు చేపట్టాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు మండల తహశీల్దారుకు సిపిఎం ప్రజాప్రతినిధులు, నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ వల్ల వరదలకు ప్రతి ఏటా ఇబ్బంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ ఏడాదైనా ముందస్తుగా ప్రతి సచివాలయ పరిధిలో బియ్యం, కిరోసిన్ వంటి నిత్యావసరాలు సిద్ధంగా ఉంచాలన్నారు. కోతులగుట్ట నుండి, ఏడుగురాళ్లపల్లి మీదుగా రోడ్డును పునరుద్ధరించాలన్నారు. గత కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినా నిధులు మంజూరు చేసినా ఇప్పటికి వరకు రోడ్డు సరిగా చేయలేదన్నారు. మళ్ళీ గోదారి వస్తే భద్రాచలం వెళ్ళడానికి అదే ఏకైక రహదారి అని, కాబట్టి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. గత ఏడాది తార్పాలిన్లు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. నిత్యావసరాలను అధిక ధరలకు అమ్ముతున్నా కట్టడి చేయలేదని పేర్కొన్నారు. దీనికి స్పందించిన తహసీల్దార్ వెంకట మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ విషయమై పై అధికారులు సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని. ఎటువంటి ఇబ్బంది కలగకుండా వరద బాధితులకు ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. గామాలలో పర్యటించి ప్రజల అవసరాలు తెలుసుకుంటామని, ప్రజలకు మెరుగైన సదుపాయాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, సిపిఎం మండల కార్యదర్శి సాయం సీతారామయ్య, సిపిఎం ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

వంతెనలు నిర్మించారు... అప్రోచ్ రోడ్లు మరిచారు..!

- చినుకు పడితే రాకపోకలకు తప్పని ఇబ్బందులు
- అవస్థలు పడుతున్న గిరిజనులు, వాహనదారులు
- ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారులు

పటిష్ట అప్రోచ్ రోడ్డు లేని గోరాపూర్ వంతెన.

ప్రజాశక్తి - దుంబ్రిగుడ: అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల నిర్వాకం మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు గుదిబండగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొండవాగులు, గెడ్డలు దాటేందుకు వంతెనలు నిర్మించినా, వాటిని అనుబంధంగా అప్రోచ్ రోడ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం వల్ల రాకపోకలకు మారుమూల గ్రామాల మన్యవాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులు, నేతలకు పదేపదే మొరపెట్టుకుని, విసిగిపోయి చివరకు తామే తాత్కాలికంగా మట్టితో రవాణాకు అనువుగా మార్చుకుని రాకపోకలు సాగిస్తున్నారు.

మన్యంలోని మారుమూల గిరిజన గ్రామాలకు వెళ్లాలంటే విధిగా అనేక గెడ్డలను దాటాల్సిందే. ఆయా గెడ్డలపై రాకపోకలకు వీలుగా ప్రభుత్వం అవసరమైన గెడ్డవాగు ప్రాంతాల్లో వంతెనలు నిర్మిస్తోంది కానీ వంతెనలకు ఇరుపక్కలా అప్రోచ్ రోడ్డు నిర్మించకపోవడంతో గిరిజనులు రవాణాకు నానా ఇబ్బందులు పడుతున్నారు. వంతెనతో పాటు అప్రోచ్ రోడ్డు కూడా వెంటనే నిర్మించాల్సి ఉన్నా, కాంట్రాక్టర్, అధికారులు దాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు మండలంలోని లోగిలి, గోరపూర్ గెడ్డల వద్ద వంతెనలు నిర్మించినా అప్రోచ్ రోడ్డు లేకపోవడంతో రాకపోకలకు గిరిజనం ఇబ్బందులు పడుతుండడమే ఇందుకు నిదర్శనం.

మండలంలోని గసభ పంచాయితీ లోగిలిగెడ్డను అనుకుని గసభ పంచాయితీ గ్రామాలతోపాటు కొల్లాపుట్టు, సొవ్వా పంచాయతీ గ్రామాలు ఉన్నాయి. ఉధృతంగా ప్రవహించే గసభ గెడ్డ వద్ద రాకపోకలకు ఇబ్బందులు పడే గిరిజనం, ఏళ్ల తరబడి ప్రభుత్వానికి, అధికారులకు మొరపెట్టుకోవడంతో ఎట్టకేలకు స్పందన వచ్చి, నిధులు మంజూరుచేసి వంతెనను నిర్మించారు. అయితే నేటికీ వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేయలేదు. దీంతో రాకపోకలకు ప్రజల ఇక్కట్లు ఇంకా తొలగలేదనే చెప్పాలి.

మరోవైపు ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ఖంద్రుం పంచాయతీ జాకరవలస సమీపంలో గల గోరపూర్ గెడ్డపై కూడా ఇలాగే ఎన్నో ఏళ ఎదురుచూపుల తర్వాత వంతెన నిర్మించారు. కానీ అక్కడ కూడా అలాగే అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టకుండా వంతెనలను కూడా ప్రారంభించారు. దీంతో వర్షాలు కురిసినప్పుడు వంతెనలకు ఇరువైపులా వేసిన మట్టి కొట్టుకుపోతుండడంతో రాకపోకలకు గిరిజనులు, వాహనదారులు ఇబ్బందులు పడక తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత స్థాయి అధికారులు స్పందించి, కొండగెడ్డలపై భారీ వంతెనలు నిర్మించిన చోట ఇరువైపులా పటిష్టమైన అప్రోచ్ రోడ్డు నిర్మాణాలు చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

లోగిలి వంతెన

210 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- కొయ్యూరు

అక్రమంగా తరలిస్తున్న 210 కేజీల గంజాయిని కొయ్యూరు పోలీసులు సోమవారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... కొయ్యూరు ఎస్సై రామకృష్ణకు వచ్చిన సమాచారం మేరకు చీడిపాలెం జంక్షన్ వద్ద సోమవారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో బూదరాళ్ల నుండి కాకరపాడు వైపు వస్తున్న రెండు బైక్‌లు, ఒక ఆటోని పోలీసులు తనిఖీ చేస్తుండగా, వారిని చూసి నిందితులు పారిపోవడానికి ప్రయత్నం చేశారు. పోలీసులు నిందితులను పట్టుకొని తనిఖీ చేయగా 210 కేజీల గంజాయి లభ్యమైంది. వాహనాలను, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బోండా ప్రభాకర్, జర్సింగి గంతన్న, గల్లెలి రామారావు, జర్సింగి సంతోష్, లైచన్ తంగుల్, బాసుదేవ్ తంగుల్ తదితర ఆరుగురు నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.10.55 లక్షలు ఉంటుందని చెప్పారు.

పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

పారదర్శకంగా ఓట్ల లెక్కింపు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయ సునీత

కౌంటింగ్ సిబ్బందికి శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత

ప్రజాశక్తి- పాడేరు : ఓట్ల లెక్కింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ఆదేశించారు. మంగళవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో పాడేరు, అరకువ్యాలీ, రంప చోడవరం అసెంబ్లీ నియోజక వర్గాల కౌంటింగ్ అధికారులకు ఒక రోజా శిక్షణా శిబిరంలో కలెక్టర్ మాట్లాడుతూ ఓట్లు లెక్కింపులో పాల్గొనే అధికారులు, సిబ్బంది ప్రతి అంశంపైనా సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓట్లు లెక్కింపులో పాటించ వలసిన జాగ్రత్తలు, క్రమశిక్షణ విధి విధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికలపోలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించిన అధికారులు, ప్రభుత్వయంత్రాంగాన్ని అభినందించారు. అదే నిబద్ధతను, చొరవ కౌంటింగ్ ప్రక్రియలో చూపించి ఎటువంటి తప్పిదాలు లేకుండా పక్కాగా కౌంటింగ్ పూర్తి చేయాలని సూచించారు.ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కించాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది మొబైల్ ఫోన్లను వెంట తీసుకుని రాకూడదన్నారు. ఫలితాలు వెల్లడిలో అనుసరించాల్సిన విధానంపై అవగాహన కల్పించారు.నిర్దిష్టమైన సమయానికి కౌంటింగ్ అధికారులు విధులకు హాజరు కావాలని సూచించారు. కౌంటింగ్ ఏజెంట్లతో ఎటువంటి సంభాషించడం, ఎన్నికల సంఘం నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

ఓట్లు లెక్కింపునకు పటిష్ట భద్రత

అదనపు ఎస్‌పి ధీరజ్ మాట్లాడుతూ ఓట్లు లెక్కింపు ప్రక్రియకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ భవనాల వద్ద మూడంచెల భద్రత కొనసాగుతోందన్నారు. కౌంటింగ్ అధికారులకు, సిబ్బందికి జారీ చేసిన గుర్తింపు కార్డులను తప్పని సరిగా తీసుకురావాలని, లేకుంటే ప్రవేశముండదన్నారు.

కౌంటింగ్ సిబ్బందికి ప్రత్యేక ప్రవేశ మార్గాలు

అరకు అసెంబ్లీ, పార్లమెంటు నియోజక వర్గాలకు చెందిన అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బందికి వేర్వేరుగా వాహనాల పార్కింగ్, ప్రవేశమార్గాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అధికారులు కౌంటింగ్ ఏజెంట్లతో వివాదాలకు తావులేకుండా వ్యవహరించాలని స్పష్టం చేసారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి. పద్మావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వివిఎస్. శర్మ, పి.అంబేద్కర్, జిల్లాలోని మూడు నియోజక వర్గాల కౌంటింగ్ అధికారులు పాల్గొన్నారు.

కూలి రేట్లు పెంచితేనే పనులు చేస్తాం

- స్పష్టం చేసిన దినసరి కూలీలు
- కాంట్రాక్టరుతో చర్చలు విఫలం
- ప్రారంభం కాని డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మతు పనులు

పనులకు వెళ్లకుండా ఇంటిదారి పట్టిన కూలీలు

ప్రజాశక్తి- సీలేరు

ఎపి జెన్కో సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని దిగువ సీలేరు డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మతు పనులు చేసే కూలీలు తమ కూలి రేట్లు పెంచాలని ఆందోళనకు దిగారు. ఈ కెనాల్ మరమ్మతు పనులను ఏపీ జెన్కో అధికారులు డొంకరాయి, మోతుగూడెం ఏపీ జెన్కో కాంట్రాక్టర్లకు అప్పగించారు. అయితే కాంట్రాక్టర్లు కూలీలకు చెల్లిస్తున్న కూలి రేట్లు గిట్టుబాటు కాకపోవడంతో దినసరి కూలీలు పనులు చేపట్టకుండా నిరాకరించారు. గత 10 సంవత్సరాల నుండి రోజు కూలి స్త్రీలకు రూ.250, పురుషులకు రూ.300 ఇస్తున్నారని, ప్రస్తుతం అన్నింటి ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ఈ కూలి రేట్లు గిట్టుబాటు కాదని కూలీలు స్పష్టం చేశారు. వీరికి సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చింతా రాంబాబు అండగా నిలిచారు. దీంతో ఏపీ జెన్కో అధికారులు డొంకరాయి కార్యాలయంలో కాంట్రాక్టర్లతో సమావేశం జరిపి కూలీలు దినసరి కూలి రేట్లు సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. సిఐటియు నేత రాంబాబు, కూలీలతో కాంట్రాక్టర్లు చర్చలు చేశారు. రోజుకి మహిళలకు రూ.400, పురుషులకు రూ.450 ఇస్తామని చెప్పారు. అయితే దానికి కూలీలు నిరాకరించారు. పురుషులకు రోజుకి రూ.600, మహిళకు రూ.500 ఇవ్వాలని కోరారు. అందుకు కాంట్రాక్టర్లు నిరాకరించడంతో చర్చలు విఫలమయ్యాయి. దీంతో మరమ్మతు పనులు నిలిచిపోయాయి.

పదేళ్ల నుండి అదే కూలి

పది సంవత్సరాల నుంచి స్త్రీలకు రూ.250, పురుషులకు రూ.300 కూలి రేట్లు చెల్లించడం ఎంతవరకు సమంజసం. మేము చెప్పిన రేట్లు కాంట్రాక్టర్లు చెల్లిస్తేనే పనులు చేస్తాం.

- వరలక్ష్మి, డొంకరాయి

కూలి రేట్లు పెంచాల్సిందే

మాకు గిట్టుబాటు అయ్యే విధంగా కూలి రేట్లు కల్పిస్తేనే డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మతు పనుల్లో పాల్గొంటాం. మమ్మల్ని కాదని వేరే లేబరును తెచ్చి పనులు చేయిస్తే సహించేది లేదు.

- కొర్ర ఓబి, డొంకరాయి

పవర్ కెనాల్ మరమ్మతు పనులకు గ్రీన్ సిగ్నల్

ఆగిన నీటి విడుదల - నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

ప్రజాశక్తి -సీలేరు

ఎపి జెన్కో సీలేరు కాంప్లెక్స్ పరిధి పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి నీరందించే 16 కిలోమీటర్ల పొడవున్న దిగువ సీలేరు డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మతు పనులకు ఏపీ జెన్కో అధికారులు ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మరమ్మతులో భాగంగా కాంక్రీటు గ్రీటింగ్ పనులు చేపట్టడానికి ఎల్‌సి అనుమతులు ఏపీ జెన్కో అధికారులు మంజూరు చేశారు. దీంతో సోమవారం అర్ధరాత్రి కెనాల్ నుంచి నీటిని నిలుపుదల చేశారు. మంగళవారం ఉదయం నుంచి పనులు చేపట్టడానికి కాంట్రాక్టులను అప్రమత్తం చేసి ఇసుక, చిప్స్, సిమెంటు తదితర సామాగ్రి పనులు నిర్వహించే కెనాల్ ప్రదేశానికి తరలించాలని ఆదేశించారు. కెనాల్ మరమ్మతు పనులకు 1.50 కోట్లు నుంచి రూ.2 కోట్లు వరకు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఈనెల 28 నుంచి వచ్చే నెల 10 వరకు మరమ్మతు పనులు పూర్తి చేయడానికి ఏపీ జెన్కో అధికారులు కార్యాచరణ రూపొందించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు లోపించకుండా మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. పవర్ కెనాల్ మరమ్మతు పనుల నేపథ్యంలో కెనాల్ నుంచి నీటిని సోమవారం అర్ధరాత్రి నుంచి నిలుపుదల చేయడంతో సీలేరు కాంప్లెక్స్ పరిధిలో 25 మెగావాట్లు సామర్థ్యం గల డొంకరాయి జల విద్యుత్ కేంద్రం, 460 మెగావాట్లు సామర్థ్యం గల పోల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. ఎగు సీలేరు జల విద్యుత్ కేంద్రంలో మాత్రమే గ్రిడ్ ఆదేశాల మేరకు విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది.

అన్ని ధరలూ పెరిగాయి

బియ్యం, పప్పులు, ఉప్పులు ఇలా అన్నింటి ధరలు భారీగా పెరిగాయి. మాకు ఇచ్చే కూలీలు రేట్లు మాత్రం పెరగడం లేదు. మేము ఏం పాపం చేశాం. మాకు గిట్టుబాటు రేట్లు కల్పించకపోతే మా కుటుంబాలు బతికేది ఎలా. మాకు వెన్నుదన్నుగా సిఐటియు చింతా రాంబాబు ఉన్నారు. ఆయన నాయకత్వంలో మాకు న్యాయం జరుగుతుందని నమ్మకం ఉంది.

- కొర్ర సావిత్రి, పాలగడ్డ

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజలతో మాట్లాడుతున్న సిఐ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-దేవీపట్నం : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజు జూన్ 4న గ్రామాల్లో అల్లర్లకు పాల్పడినా, దాడులు చేసినా కఠిన చర్యలు తప్పవనిరం పచోడవరం సర్కిల్ సిఐ వి.వెంకటేశ్వరరావు, దేవీపట్నం ఎస్సై కెవి నాగార్జున హెచ్చరించారు. మండలంలోని ఇందుకూరుపేట గ్రామస్తులతో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 4న ఎటువంటి బాణసంచా కాల్చరాదని, ఊరేగింపులు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఆ రోజు 144సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ రావి శిరీష తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కళాశాలలో ఎంపీసీ, బైపిసి గ్రూపులు (ఇంగ్లీషు, తెలుగు మీడియం), సిఈసి, హెచ్ఈసి (తెలుగు మీడియం), ఒకేషనల్ సిఎస్ఈ (ఇంగ్లీష్ మీడియం) తదితర గ్రూపులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. నాడు -నేడు కార్యక్రమంలో భాగంగా ప్రతి తరగతి గదిలో ఎల్ఈడి స్క్రీన్స్, గ్రీన్ చాక్ బోర్డ్స్ ఈ ఏడాది ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థిని విద్యార్థులకు విడివిడిగా హాస్టల్ సదుపాయం ఉందన్నారు. కళాశాలలో టాయిలెట్ బ్లాక్స్, ఆర్వో ప్లాంట్ ద్వారా తాగునీటి సదుపాయం కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని విద్యార్థినీ, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రశాంత కౌంటింగ్‌కు సహకరించండి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత

రాజకీయ పార్టీల ప్రతినిధులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయసునీత సూచన

ప్రజాశక్తి-పాడేరు : వచ్చేనెల 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించడానికి అందరు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలక్టర్ ఎం. విజయ సునీత విజ్ఞప్తి చేశారు. మంగళవారం కలక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్. హాలులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, పోటీలో ఉన్న అభ్యర్థులతో నిర్వహించిన సమావేశంలో కలక్టర్ మాట్లాడుతూ ఫారం 18 ద్వారా కౌంటింగ్ ఏజెంట్ ను నియమించి గుర్తింపు కార్డుతో కౌంటింగ్ కేంద్రానికి పంపించాలని సూచించారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజంట్లు ఎవ్వరికీ మొబైల్స్ గాని, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు గాని తీసుకెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అరకు, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాలకు, అరకు పార్లమెంటుకు సంబంధించి అరకు, పాడేరు సెగ్మెంట్ల కౌంటింగ్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయడం జరిగిందని అదేవిధంగా రంపచోడవరం నియోజకవర్గం మరియు అరకు పార్లమెంట్ సెగ్మెంట్‌కు సంబంధించి రంపచోడవరం జూనియర్ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్‌కు 14 టేబుల్స్ ఏర్పాటు చేశామని, అరకులో 304 పోలింగ్ కేంద్రాలకు 22 రౌండ్ల లెక్కింపు ఉంటుందన్నారు. పాడేరులో 318 పోలింగ్ కేంద్రాలకు 23రౌండ్ల లెక్కింపు ఉంటుందని, అదేవిధంగా రంపచోడవరంలో రౌండుకు 20 టేబుల్స్ ఏర్పాటు చేసినందున 399 పోలింగ్ కేంద్రాలకు 20 రౌండ్లు లెక్కింపు ఉంటుందని వివరించారు. ముందుగా పోస్టల్ బ్యాలేట్ల లెక్కింపు జరుగుతుందని అరకులో 3492, పాడేరులో 2546, రంపచోదవారంలో 4123 కలిపి మొత్తం 10,161 పోస్టల్ బ్యాలేట్లతో పాటు అప్పటివరకు అందిన సర్వీసు ఓట్లను లెక్కిస్తామన్నారు. కౌంటింగ్‌లో సమస్యలు తలెత్తడానికి గల అవకాశాలను, పరిష్కారాలను కలక్టర్ ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. రంపచోడవరం కౌంటింగ్ కేంద్రంలో 80 సిసి కెమెరాలు, పాడేరు కేంద్రంలో 29 సిసి కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు.

కౌంటింగ్ ప్రక్రియ పర్యవేక్షణకు అబ్జర్వర్లు

అరకు నియోజకవర్గానికి తమిళనాడుకు చెందిన కె.వివేకానందన్, పాడేరు నియోజకవర్గానికి ఛత్తీస్‌గఢ్‌కు చెందిన డాక్టర్ గజేంద్ర కుమార్ సింగ్, రంపచోడవరం నియోజకవర్గానికి బీహార్‌కు చెందిన రేణుకా శ్రీ వాత్సవ్ అబ్జర్వర్లుగా ఎన్నికల కమిషన్ నియమించినదన్నారు. అదేవిధంగా అరకు పార్లమెంట్‌లోని అరకు సిగ్మెంట్ కు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్, నియోజకవర్గానికి చింతూరు పిఒ కె. చైతన్య, పాడేరు సెగ్మెంట్ కు జేసి భావన వశిష్ట్ , నియోజకవర్గానికి డిఆర్ఒ బి. పద్మావతి, రంపచోడవరం సెగ్మెంట్‌కు సబ్ కలక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్, నియోజకవర్గానికి ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు.

అదనపు పోలీసు సూపరింటెండెంట్ ప్రతాప్ శివ కిశోర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందని,కౌంటింగ్ కు ముందు, తరువాత ఎటువంటి ఊరేగింపులు చేయరాదన్నారు. పార్టీ పరంగా గానీ వ్యక్తిపరంగాగానీ ఎటువంటి దూషణలు చేయరాదని సూచించారు. బాణాసంచా నిషేధించామన్నారు. పోలింగ్, కౌంటింగ్, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలను సంబంధించి ఎటువంటి అవాస్తవ వార్తలను, ఫేక్ న్యూస్‌లను ప్రచారం చేసినా వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 31నుంచి కౌంటింగ్ వరకు డిగ్రీ కళాశాల మార్గంలో మరింత భద్రత పెంచుతామన్నారు.

అదనపు పోలీసు సూపరింటెండెంట్ ధీరజ్ మాట్లాడుతూ పాడేరు, అరకు కౌంటింగ్ కేంద్రాలకు వెళ్ళాల్సిన సిబ్బంది, ఏజంట్లు కలుసుకునే అవకాశం లేదని, వారికి వేర్వేరుగా వాహనాల పార్కింగ్, ప్రవేశమార్గాలను ఏర్పాటు చేశామన్నారు. సిబ్బంది, ఏజంట్లు వారికీ కేటాయించిన గ్యాంగ్ వే మార్గాల ద్వారా ప్రవేశించాలని సూచించారు. సమావేశంలో డిఆర్ఒ . బి.పద్మావతి, వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు, రంపచోడవరం నుండి వర్చువల్ విధానంలో సబ్ కలక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్ ఆ నియోజకవర్గ వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటోస్టాండ్ లేక ఎన్ని అవస్థలో..!

-హైవే రోడ్డుపైనే ఆటోలు నిలుపుదల
-వాహనాల రాకపోకలకు తప్పని అవస్థలు
-స్థలం కేటాయించాలని కోరుతున్న ఆటోడ్రైవర్లు

ప్రజాశక్తి - డుంబ్రిగుడ: మండలంలోని కించుమండలో ఆటోలు నిలుపుదలకు పార్కింగ్ స్థలం లేకపోవడంతో ఆటోడ్రైవర్లు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆటోస్టాండ్ స్థలం లేకపోవడంతో 516ఇ హైవే రోడ్డుపైనే ఆటోలు నిలుపుదల చేస్తుండటంతో అక్కడ వాహన రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. స్థానిక మండలంలోని కించుమండ, కుర్ర, కితలంగి పంచాయతీ గ్రామాలతో పాటు హుకుంపేట గత్తుం, బొడ్డపూటు, రంగశీల, పట్టం, వెంగడ ప్రాంత పంచాయతీ గ్రామాలు, అనంతగిరి మండలాలకు చెందిన పలు ప్రాంతాల పంచాయతీ గిరిజనులు నిత్యం కించుమండకు వచ్చి నిత్యవసర వస్తువులు కొనుగోలు చేయడంతో పాటు వివిధ పనుల నిమిత్తం రాకపోకలు చేస్తుంటారు. మారుమూల గిరిజన గ్రామాలు కావడంతో రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ, ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించకపోవడంతో ఆ ప్రాంతాల గిరిజనులు ఆటోలోని ప్రయాణాలు సాగిస్తున్నారు. అవన్నీ కించుమండలో నిలుపుదల చేస్తున్నారు. అయితే అక్కడ స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే నిలిచో పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆటో డ్రైవర్లు అంటున్నారు. దీనికి తోడు కించుమండలో స్టేట్ బ్యాంక్ ఉండటంతో బ్యాంకు లావాదేవీలకు వచ్చేవారు నిత్యం ఉంటూనే ఉంటారు. అంతేకాక ప్రతి బుధవారం వారపు సంత జరుగుతుంది దీంతో అధిక శాతం మంది గిరిజనులు వాహనాలు రాకపోకలు చేస్తుండడంతో అక్కడ రద్దీ ఏర్పడుతుందని, తద్వారా ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని పలువురు ఆటో డ్రైవర్లు అంటున్నారు. వాహనాలు పార్కింగ్ చేయాల్సిన చోట కొంతమంది గిరిజనేతరులు దుకాణాలు నిర్మించుకోవడంతో పార్కింగ్‌కు పూర్తిగా స్థలం లేకుండా పోతుందని ఆటో డ్రైవర్లు, స్థానికులు అంటున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి, కించుమండలో ఆటో స్టాండ్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ఆటో డ్రైవర్లు కోరుతున్నారు.

కించుమండ హైవేలో రోడ్డు పక్కనే నిలబెట్టిన ఆటోలు

విద్యార్థులతో ఆటలాడిస్తున్న లైబ్రేరియన్ సునీత

గ్రంథాలయంలో మ్యూజికల్ చైర్ పోటీలు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు మ్యూజికల్ చైర్ పోటీలను నిర్వహించారు. 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో విద్యార్థులు బయటికి వెళ్లకుండా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు ఉభయ తారకంగా ఉన్నాయని పిల్లల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రంథాలయ అధికారి సునీత, సిబ్బంది సుబ్బారావు, విద్యార్థులు, చిన్నారులు పాల్గొన్నారు.

హయ్యర్ పెన్షన్ వర్తింపజేయాలి

ప్రజాశక్తి -కరాస: హయ్యర్ పెన్షన్‌పై పిఎఫ్ అధికారులు వెంటనే నిర్ణయం తీసుకొని కార్మికులకు మేలు చేయాలని ఎపి రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్‌చేశారు. ఈ మేరకు మంగళవారం పిఎఫ్ కమిషనర్‌ను కలిసి హయ్యర్ పెన్షన్‌పై చర్చించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు కె.సుధాకర్ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పు ఇపిఎఫ్ -95 పెన్షనర్లకు శరాఘాతంగా మారిందన్నారు. ఈ తీర్పు ద్వారా హయ్యర్ పెన్షన్ అమలు చేయకుండా అనేక కుంటి సాకులు చూపించి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఇంతవరకు షిప్‌యార్డ్, బిహెచ్‌ఇఎల్ ఉద్యోగులకు ఎటువంటి నోటీసులూ అందలేదని తెలిపారు. కొంతమందికి నోటీసులు అంది దాదాపు నాలుగు వందల కోట్లు పిఎఫ్ ఆఫీస్‌లో జమ చేసి ఐదు నెలలు అవుతున్నా ఇంతవరకు ఎలాంటి సమాచారం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు కుమారమంగళం, ఎస్‌కె.హుస్సేన్, కెపి.కుమార్, సిహెచ్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

31న లైబ్రేరియన్ నాగరాజు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి -పద్మనాభం : మండల కేంద్రమైన పద్మనాభంలో ఉన్న శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న ఊసా నాగరాజు ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేస్తున్నారు. మచిలీపట్నం సమీపంలో ఉన్న పోలవరం వీరి స్వగ్రామం. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చారు. తండ్రి సుధాకరరావు, తల్లి కామేశ్వరమ్మకు ప్రథమ సంతానంగా 1962 మే 5న నాగరజాఉ జన్మించారు. నాగరాజు మూడు నెలల వయసున్నప్పుడే బతుకు తెరువు కోసం ఆ కుటుంబం విశాఖపట్నం వలస వచ్చారు. నాగరాజుకు ఒక చెల్లి, ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. 1968లో విశాఖపట్నం పోర్టు స్కూల్లో ఒకటవ తరగతిలో చేరారు. 10వ తరగతి వరకు అక్కడే విద్యాభ్యాసం కొనసాగించారు. 1981లో విశాఖపట్నంలోని కృష్ణా కాలేజీలో ఇంటర్, ఇంకా ఆపై చదువులు కొనసాగించారు. 1986లో ఉన్నత చదువులను పూర్తి చేసుకున్నారు. 1990లో పోలవరం గ్రామానికి చెందిన పద్మతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు మగ పిల్లలు. 1999లో జిల్లా గ్రంథాలయంలో అటెండర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. 2011లో లైబ్రేరియన్‌గా ప్రమోషన్ పొందారు. పలు ప్రాంతాల్లో లైబ్రేరియన్‌గా పనిచేశారు. ఏడాది క్రితం బదిలీపై పద్మనాభం లైబ్రేరియన్‌గా వచ్చారు. శాఖ గ్రంథాలయలో ఈ నెల 31న ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

మండల స్థాయి వంటల పోటీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక యుపి పాఠశాలలో మండల స్థాయి వంటల పోటీలు మంగళవారం నిర్వహించారు. పిఎం పోషన్, గోరు ముద్ద కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ రకాల వంటలు రుచి గాను, శుచిగాను ఉన్నాయి. విద్యార్థులకు పౌష్టికాహారం ఎలా ఇవ్వవచ్చునేది ఆచరణాత్మకంగా వివిధ పదార్థాలు వండి వడ్డించారు. వండిన అన్నం, పులిహోర, పప్పు, గోంగూర, సాంబారు తదితరాలను ప్రదర్శించారు. జిల్లా విద్యా శాఖ స్కీమ్స్ ఏడీ ఎఎ జ్యోతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం ప్రాధాన్యతను వంట చేసే మహిళలకు, సహాయకులకు వివరించారు. వంటల తయారీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు 1,2 ఎం.శివ రాణి, జయప్రద, పాఠశాల హెచ్‌ఎం జయసుధ, పిఎన్‌ఎం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మర్లపాటి నాగేశ్వరరావు

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

ప్రజాశక్తి - ఎటపాక : ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం నిరంతరం తన కృషిని కొనసాగిస్తుందని ఆ పార్టీ ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ఎర్రబోరు గ్రామంలో బుద్దుల భద్రయ్య అధ్యక్షతన జరిగిన సిపిఎం ఎటపాక మండల కమిటీ సమావేశంలో నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన, గిరిజనేతర ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి సిపిఎం గతం నుండి కృషి చేస్తుందని చెప్పారు. మే 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎటపాక మండలంలో సిపిఎం అభ్యర్థులకు ఓట్లు వేసిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో ప్రజలెదుర్కొనే సమస్యల పరిష్కారానికి ప్రజల తరపున సిపిఎం పోరాడుతుందని చెప్పారు. సిపిఎం మండల కార్యదర్శి ఐవి మాట్లాడుతూ వర్షాకాలం రాబోతుందని, వరద సహాయక చర్యల కొరకు అవసరమైన మెటీరియల్‌ను ప్రభుత్వ అధికారులు సిద్ధం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆకిశెట్టిరాము, ఇరపా అజయ్, పి.బాలకృష్ణ, సోందే రామారావు, సవలం రాము, రత్తమ్మ, ఇరప సత్యం పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : విధి నిర్వహణలో సిబ్బంది ఆలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎంపీడీవో లోకలు యాదగిరిశ్వరరావు హెచ్చరించారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో మంగళవారం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో సిబ్బంది ఎవరైనా అవకతవకలకు పాల్పడితే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని తంటికొండ గ్రామంలో ఇటీవల పనిచేసిన కూలీల మస్టర్ల నమోదులో అలసత్వం వహించిన కంప్యూటర్ ఆపరేటర్ వీరారెడ్డికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఉపాధి కూలీకి తప్పనిసరిగా పని కల్పించాలని, కొలతలు, మస్తరు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఏపీవో సురేష్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - మారేడుమిల్లి : పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి భాధ్యత అని మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ హరికృష్ణ, రాణి శిరీష అన్నారు. మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసర ప్రాంతంలో మంగళవారం జెడ్పిటిసి బాలాజీబాబు, సర్పంచ్ కొండ జాకబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటి పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటడం అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోదులూరు వైద్యాధికారి సుబ్రహ్మణ్యం, మారేడుమిల్లి వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తప్పనిసరిగా హాజరు నమోదు చేయాలి

ప్రజాశక్తి - కొయ్యూరు : గ్రామ సచివాలయ సిబ్బంది ప్రతి రోజూ తప్పనిసరిగా హాజరును నమోదు చేసుకోవాలని కొయ్యూరు ఎంపీడీవో లాలం సీతయ్య మంగళవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. సచివాలయ సిబ్బంది ఇన్ అండ్ అవుట్ హాజరును తప్పనిసరిగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. లేకపోతే జీతాలు కోల్పోయే పరిస్థితి ఎదుర్కొంటారని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది హాజరును నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-రంపచోడవరం

మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు కీర్తిశేషులు నందమూరి తారకరామారావు 101 జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి రంపచోడవరం నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మిరియాల శిరీష దేవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబు రమేష్, మాజీ మండల అధ్యక్షులు అడబాల బాపిరాజు, మాజీ సర్పంచ్ వై నిరంజనీ దేవి, టిడిపి నాయకులు వెంకట్, చవలం బాపిరాజు, మఠం భాస్కర్ పాల్గొన్నారు.

విఆర్ పురం : మండలంలోని రేఖపల్లి టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి, కేక్ కట్ చేసి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ ముత్యాల రామారావు, టిడిపి నాయకులు ఆచంట శ్రీనివాస్, బురక కన్నారావు, వైస్ ఎంపిపి వడ్డానపు భాగ్యలక్ష్మి, సవలం రాజేంద్ర ప్రసాద్, బొర్రా నరేష్, బీరక సూర్య ప్రకాష్ రావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

చింతూరు : మండలంలోని నిమ్మలగూడెం గ్రామంలోని జమాల్ ఖాన్ ఆయుర్వేద కేంద్రం ఆవరణలో మంగళవారం ఎన్టీరామారావు చిత్రపటానికి జమాల్ ఖాన్ పూలమాలను వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు కట్ట మారయ్య, కొమరం అప్పారావు, మాజీ సర్పంచ్ కారం రామకృష్ణ, విద్యాసాగర్, సున్నం రమేష్, కట్టి కన్నయ్య, మచ్చ వీరబాబు, కుంచ వెంకయ్య, కింజ అనిత, కారం కన్నారావు, ధర్మల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : మండల కేంద్రంలో ఎన్‌టిఆర్ చిత్ర పటానికి టిడిపి మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వర్యంలో టిడిపి అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు దంతులూరి శివరామ చంద్రరాజు తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం స్థానిక పిహెచ్సిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిహెచ్ అప్పారావు, టిడిపి నాయకులు ఎం.మోహన్ కుమార్, చెక్కా లోవరాజు, అద్దేపల్లి చిన్నారావు, బివిఎస్ఎన్ గుప్త, అప్పలరాజు, ప్రశాంత్ పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో ఎన్‌టిఆర్ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

సీలేరు : జీకే వీధి మండలంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి టిడిపి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ముక్కలు మహేష్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండల కేంద్రంలో ఎన్‌టిఆర్ చిత్ర పటానికి జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి ప్రసాద్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు సర్పంచ్ మాకాడ బాలరాజు, ఎస్‌కే ఖాన్, మాకాడ బురుగులయ్య, ఎం వీరయ్య దొర, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. కొయ్యూరులో టీడీపీ మండల అధ్యక్షుడు గొలిసింగి సత్యనారాయణ, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొర్రు రామ్మూర్తి, మాజీ ఎంపీటీసీ శివరామరాజు తదితరులు ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

పెరుగుతున్న విద్యుత్ వినియోగం

పలుచోట్ల అనధికారిక కోతలు

ఉష్ణోగ్రతలు, ఉక్కపోత పెరగడంతో అధికమైన ఎసి, కూలర్ల వాడకం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత ఉండడంతో ఆ ప్రభావం విద్యుత్ వినియోగంపై పడింది. వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ ప్రకటనతో కొంత ఊరట లభిస్తుందని అనుకున్నా, ప్రస్తుత వాతావరణం బయటకు వెళ్లడానికి వీలుకానిరీతిలో ఉంది. ఉక్కపోత ఎక్కువవడంతో ఫ్యాన్లు, ఎసిలు, కూలర్ల వాడకం ఉమ్మడి విశాఖ జిల్లాలో పెరిగింది. గత నెల కంటే ఈ నెలలో సాధారణ డిమాండ్ కంటే విద్యుత్ వినియోగం అధికమైంది. ఉమ్మడి విశాఖ జిల్లాలోని రోజువారీ సగటు విద్యుత్ వినియోగం 28.364 మిలియన్ యూనిట్లుగా వుంది. కానీ వేసవి వేడి, ఉక్కపోతతో సగటు వినియోగం దాటిపోతోంది. విద్యుత్ వినియోగం పెరగడంతో సర్దుబాటు చేసే క్రమంలో గ్రామీణ ప్రాంతంలో విద్యుత్ కోతలు అనధికారికంగా జరుగుతున్నాయి. ఎక్కువగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, మళ్లీ రాత్రి వేళ విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటోంది. ఇళ్లలో ఫ్యాన్ల వాడకం కంటే ఎసిల వినియోగం ఎక్కువగా వుండడంతో విద్యుత్ వినియోగం పెరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఏప్రిల్ కంటే మేలో విద్యుత్ వినియోగం పెరిగింది. ఏప్రిల్‌లో కూడా ఉక్కపోత, ఉష్ణోగ్రత ఎక్కువగా వున్న రోజుల్లో అధిక విద్యుత్ వినియోగం నమోదైంది. ఈ ఏడాది మే, ఏప్రిల్ నెలల్లో 21 నుంచి 27 వరకు ఇపిడిసిఎల్ విశాఖపట్నం సర్కిల్‌లో నమోదైన విద్యుత్ వినియోగాన్ని పరిశీలిస్తే విద్యుత్ వాడకంలో హెచ్చు, తగ్గులు కనిపిస్తున్నాయి. వాతావరణ పరిస్థితులు ఇలానేవుంటే విద్యుత్ వినియోగం ఇంకా పెరుగుతుందని విద్యుత్ శాఖాధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 21 నుంచి 27 వరకు మే, ఏప్రిల్ నెలల్లో విద్యుత్ వినియోగం (మిలియన్ యూనిట్లలో)

తేదీ	మే వినియోగం	ఏప్రిల్ వినియోగం
21	30.631	29.310
22	30.547	29.540
23	31.563	31.538
24	30.647	29.854
25	28.055	29.920
26	29.235	30.491
27	30.815	29.447

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్యులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జమాల్ బాషా ఆదేశించారు. కొయ్యూరు మండలం కంఠారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ముందుగా ఆసుపత్రిలోని రికార్డులను తనిఖీ చేశారు. పీహెచ్సీలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు.

ఆక్రమణ భూమి అప్పగింత

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థలం ఆక్రమణకు గురి కావడంతో మంగళవారం రెవెన్యూ అధికారులు భూమిని పాఠశాలకు అప్పగించారు. పాఠశాలకు సంబంధించిన 20 సెంట్లు భూమి ఆక్రమణకు గురికావడంతో స్థానిక తహశీల్దారు డీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది సర్వే నిర్వహించి పాఠశాల హెచ్‌ఎంకు ఆ స్థలాన్ని అప్పగించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్‌గా పరమేశ్వర్ ఫంక్వాల్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్‌గా పరమేశ్వర్ ఫంక్వాల్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఐఐటి కాన్పూర్‌లో విద్యాభ్యాసం చేసిన ఆయన ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ ఇంజినీర్స్ 1988 బ్యాచ్ అధికారిగా రైల్వే శాఖలో ప్రవేశించి మూడున్నర దశాబ్దాల పాటు పలు విభాగాల్లో పనిచేశారు. రాజ్‌కోట్ డిఆర్‌ఎంగా, అహ్మదాబాద్ ఎడిఆర్‌ఎంగా, ఆర్‌ఆర్‌బి ఛైర్మన్‌గా, ఆర్‌డిఎస్‌ఒ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పలు ఉన్నత స్థానాల్లో విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం ఈస్ట్ కోస్ట్ రైల్వేలో ముంబయిలోని పశ్చిమ రైల్వేలో ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఆయన ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్‌గా బదిలీపై వచ్చారు.

ఆర్‌డిఎస్‌ఒ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేసిన సమయంలో ట్రాక్ వంతెనల రంగాలలో రైళ్ల వేగాన్ని పెంచడానికి వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. రైల్వే ఇంజినీరింగ్‌తో పాటు మానవ వనరుల విధులు, పరిశోధన, డిజైన్‌లు, నిర్వహణలో అపారమైన అనుభవం కలిగి ఉన్నారు.